జోరుగా క్రికెట్ బెట్టింగ్!

- యాప్‌లలో పందేలు
- వాట్సాప్‌లో రాయబేరాలు
- నిఘా పెంచిన ఎస్పీ టీం

రాయదుర్గం/బ్రహ్మసముద్రం: క్రికెట్ బెట్టింగ్ జోరందుకుంది. 'ఐపీఎల్–16' ఆట మొదలై నాలుగు రోజులు కూడా గడవకముందే అప్పుడే రూ.లక్షల్లో చేతులు మారాయి. వాట్సాప్ గ్రూపుల్లోనే రాయబేరాలు సాగిస్తూ చీకటి కోణానికి తెరతీస్తున్నారు. ఈ వ్యవహారంపై పోలీసుల నిఘా సైతం ముమ్మరమైంది. జిల్లాలోని కర్ణాటక సరిద్దునున్న రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాల్లో సంచరిస్తున్న ఓ ముఠా భారీ ఎత్తున బెట్టింగ్ నిర్వహించే దిశగా కసరత్తు మొదలుపెట్టింది. పోలీసులకు చిక్కని స్థావరాలను ఎంపిక చేసుకునేలా పావులు కదుపుతున్నట్టు తెలుస్తోంది.

బంతి బంతికీ ఓ రేటు..

20 ఓవర్లు ఉత్కంఠ భరితంగా సాగే ఈ పొట్టి క్రికెట్‌లో బంతి బంతికి ఓ రేటు కట్టి బెట్టింగ్ ఆడతారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ఈ వ్యవహారం సాగుతున్నట్టు తెలుస్తోంది. గెలుపుపై కొందరు పందెం కాయగా, ఈ మ్యాచ్‌లో ఇన్నే సిక్సులు కొడతారు. ఆ బ్యాట్స్‌మెన్ చేసే పరుగులు ఇన్నేనంటూ రేటు కట్టి బెట్టింగ్‌లు ఆడే పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది.

స్మార్ట్‌గా..

గతంలో బెట్టింగ్‌రాయుళ్లంతా ఓ చోట చేరి రూ.లక్షల్లో బెట్టింగ్ కాస్తుండేవారు. కానీ అలాంటి రోజులను వెనక్కి నెట్టేశారు. కొత్త టెక్నాలజీ వాడుకలోకి వచ్చింది. స్మార్ట్ ఫోన్‌లోనే బెట్టింగ్ కాసేలా కొన్ని యాప్‌లు వచ్చాయి. దీంతో యువత, క్రికెట్‌ప్రియులకు బెట్టింగ్ మరింత దగ్గరైంది. జూదరులు రోజుకు రూ.లక్షల్లో బెట్టింగ్ కాస్తున్నారు. అంతా ఆన్‌లైన్ కావడంతో పోలీసులకు కూడా జూదరులను గుర్తించడం, పట్టుకోవడం కష్టంగా మారింది. గత కొనేళ్లుగా పల్లెల్లో బెట్టింగ్ మాయలో పడి ఉన్న ఆస్తి అమ్ముకుని ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లిన వారెందరో ఉన్నారు. మరికొందరు ఆత్మహత్యాయత్నాలకు సైతం పాల్పడ్డారు.



గత ఏడాది రూ.50 కోట్లకు పైగా టర్నోవర్..

గత ఏడాది జరిగిన ఐపీఎల్–15 సీజన్ మ్యాచుల్లో ఏకంగా రూ.50 కోట్లకు పైగా టర్నోవర్ జరిగిందనే పుకార్లు అప్పట్లో షికార్లు చేశాయి. ఈ వ్యవహారంపై ప్రత్యేక నిఘా ఉంచిన ఎస్పీ ఫక్కీరప్ప గుట్టుగా వారి స్థావరాలను రట్టు చేసేలా ఉక్కుపాదం మోపారు. స్థానిక పోలీసులకు సైతం విషయం తెలియనీకుండా కూపీ లాగే ప్రయత్నం చేసి సఫలమయ్యారు. ఈ వ్యవహారం లో ఒకరిద్దని అరెస్టు చేసి కేసులు నమోదు చేయగా, మరికొందరిని విచారణకు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రధానంగా బెట్టింగ్ రాయుళ్లకు పోలీస్ శాఖలో కొందరు సిబ్బంది సహకారం ఉందనే విషయాన్ని నేరుగా ఓ ఉద్యోగి ఎస్పీకి ఫిర్యాదు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా ఎస్పీ లోతైన విచారణ చేపట్టడంతోనే బెట్టింగ్ వ్యవహారం బహిర్గతమైంది. ఈ కారణంగా కొందరిపై కేసులు నమోదుకాగా, సహకరించిన పోలీస్ ఉద్యోగులపై బదిలీ వేటు పడింది. ప్రస్తుతం అనుమానం కలిగిన ప్రాంతాల్లో ప్రత్యేక నిఘాను ఎస్పీ ముమ్మరం చేయించినట్టు తెలిసింది. ఇదిలా ఉండగా కళ్యాణదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు ప్రాంతాల్లోనూ ఐపీఎల్ బెట్టింగ్ జోరందుకున్నట్టు తెలుస్తోంది.

నిఘా ముమ్మరం చేశాం

ఎస్పీ ఆదేశాల మేరకు ఐపీఎల్ బెట్టింగ్‌పై నిఘా ముమ్మరం చేశాం. ఈ విషయంలో ఎంతటి వారైనా సరే రాజీపడేది లేదు. యువత మంచి మార్గంలో నడవాలి. తల్లిదండ్రులు కూడా వారి వ్యవహార శైలిపై నిఘా ఉంచాలి. బెట్టింగ్‌కు పాల్పడి జీవితాలనే నాశనం చేసుకోకూడదు. సాంకేతికంగానూ పరిశీలించేలా కీలక చర్యలు చేపట్టాం.



– బీ శ్రీనివాసులు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

క్లుప్తంగా

నేడు హుండీ కానుకల లెక్కింపు

కళ్యాణదుర్గం: పట్టణంలోని అక్కమాంబ ఆలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు హుండీ కానుకలను లెక్కించనున్నట్లు ఆలయ సిబ్బంది తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. హుండీ కానుకల కార్యక్రమానికి అనంతపురం నుంచి దేవదాయ శాఖ అధికారులు హాజరవుతారన్నారు.

అవయవ దానం అమోఘం



మాట్లాడుతున్న డాక్టర్ పరదేశినాయుడు

కళ్యాణదుర్గం: అన్ని దానాల కంటే అవయవ దానం ఎంతో అమోఘమైందని అనంతపురం మెడికల్ కళాశాల ప్రొఫెసర్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ పరదేశినాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్, జంతుశాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జయరామిరెడ్డి అధ్యక్షతన అవయవదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ మరణం తర్వాత అవయవ దానంతో మరొకరికి ప్రాణదానం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు జీఎల్ఎస్ ప్రసాద్, డాక్టర్ శేషయ్య, శ్రీదేవి, లక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ పీఎల్ కాంతారావు, శశికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మదరసా నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న అజ్మతుల్లా హుసేనీ

ఉరవకొండ: స్థానిక సయ్యద్ జామాలుద్దీన్ ఖాద్రీ దర్గా ఆవరణలో నూతనంగా నిర్మించ తలబెట్టిన బాలికల మదరసా నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేపట్టారు. మత పెద్దలు సయ్యద్ అజ్మతుల్లా హుసేనీ, తఖీబాబా, తాసీర్ బాబా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.25లక్షల వ్యయంతో చేపడుతున్న ముస్లిం ఆడపిల్లల మదరసా నిర్మాణంలో దాతలు భాగస్వాములు కావాలన్నారు. మదరసా ఏర్పాటుతో ఎంతో మంది అమ్మాయిలు ఉచితంగా ఉర్దూ, అరబిక్ చదువులు నేర్చుకుంటారన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

శెట్టూరు: మండల కేంద్రంలోని యాదవపురం వద్ద కళ్యాణదుర్గం మండలం పాల్వాయి గ్రామానికి చెందిన హనుమంతు, భూపతి కర్ణాటక ప్రాంతం నుంచి మద్యం తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి 250 మద్యం పాకెట్లు, ఒక ద్విచక్ర వాహనం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్ఐ యువరాజ్ తెలిపారు.

డంపింగ్‌యార్డుకు నిప్పు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని శాంతినగర్ వద్ద ఉన్న మున్సిపల్ చెత్త డంపింగ్‌యార్డులో సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో నిప్పంటుకుంది. దీంతో భారీ స్థాయిలో చెత్త తగలబడింది. పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగ కమ్ముకుని కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎవరైనా ఆకతాయిలు నిప్పంటించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనా స్థలానికి ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలు అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్ అక్కడకు వెళ్లి పరిస్థితి సమీక్షించారు.

నేడు 'వైఎస్సార్ ఆసరా' వారోత్సవాలు

గుమ్మఘట్ట: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ ఆసరా వారోత్సవాలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఎం కళానాయక్ సోమవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరవుతారన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న డ్వాక్రా మహిళలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

న్యాయవాదుల నిరసన

కళ్యాణదుర్గం: ఢిల్లీలో న్యాయవాదిని హత్య చేసినందుకు సోమవారం కళ్యాణదుర్గంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ పిలుపు మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు దేవేంద్ర, సీనియర్ న్యాయవాది కరణం తిప్పేస్వామి, పట్టాభి, హనుమంతరెడ్డి, సంపత్ కుమార్, రామ్మూర్తి, బుజ్జి, రామాంజనేయులు తదితరులు నిరసన చేపట్టారు. నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

కుందుర్పి: మండలంలోని అప్పిలేపల్లిలో సోమవారం రూ.30 లక్షలు నాబార్డ్ నిధులతో ఆర్డీటీ పర్యవేక్షణలో వివిధ అభివృద్ధి పనులకు నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అనురాధ భూమిపూజ చేశారు. పండ్లతోటల పెంపకం, నీటి కుంటల తవ్వకాలు, ఫారం పాండ్ల నిర్మాణం, భూ అభివృద్ధి పనులు చేపడతామన్నారు. అలాగే మందలపల్లిలో రూ.2 లక్షలతో వాటర్ ప్లాంట్ నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అతావుల్లా, ఇంజినీరు శ్రీనివాసులు, వాటర్‌షెడ్డు చైర్మన్ తిప్పేస్వామి, ఆర్డీటీ సిబ్బంది ఆనంద్ రైతులు మరిస్వామి, సోము తదితరులు పాల్గొన్నారు.

సర్వేయర్లు సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి

కళ్యాణదుర్గం: గ్రామ సర్వేయర్లు మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సర్వే ఇన్‌స్పెక్టర్ రామ్ ప్రసాద్ సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో కళ్యాణదుర్గం, రాయదుర్గం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు వెంకటరత్నం, సూర్యనారాయణతో కలసి సోమవారం గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం మండలాల గ్రామ సర్వేయర్లకు క్యూజీఐఎస్ పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం భూముల రీ సర్వేలో వినియోగిస్తున్న జీపీఎస్, రోవర్ లాంటి వాటితో సర్వే చేయడంపై వివరించారు. వారు మాట్లాడుతూ రోజూ ఉదయం ఫీల్డ్‌లో ఉండాలన్నారు. ప్రత్యేకంగా టైం టేబుల్‌ను తయారు చేసుకుని ఉదయం ఫీల్డ్, మధ్యాహ్నం రికార్డుల తయారీ అలవర్చుకోవాలన్నారు. సర్వేయర్లు గ్రామాల పరిధిలో భూముల వివరాలు, ఎఫ్ఎంబీ స్కెచ్ వంటిపై క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. రీ సర్వే సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావవ్వకుండా ఖచ్చితమైన కొలతలతో సిద్ధంగా ఉండాలన్నారు. త్వరలో మినీ హెలికాప్టర్‌తో రీ సర్వే జరుగుతుందని, అప్పటి లోగా ఏవైనా లోటుపాట్లు ఉంటే సరిదిద్దుకోవాలన్నారు. ఏవైనా సందేహాలుంటే ఉన్నతాధికారులు, సాంకేతిక సిబ్బందిని సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న సర్వే ఇన్‌స్పెక్టర్ రామ్‌ప్రసాద్

కైలాస వాహనంపై జంబుకేశ్వరుడు



రాయదుర్గంటౌన్: పట్టణంలోని స్వయంభు జంబుకేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి కైలాస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి హాజరైన భక్తులకు తీర్థప్రసాదం గావించారు. సాయంత్రం స్వామి కైలాస వాహనం కోట వీధి, వినాయక సర్కిల్ మీదుగా లక్ష్మీబజార్ సర్కిల్ వరకూ ఊరేగించారు. అక్కడి నుంచి తిరిగి స్వామి వాహనం ఆలయానికి చేరుకుంది. మంగళవారం ఉదయం ఉదయం 10 – 11.30 గంటల మధ్య స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ నరసింహారెడ్డి తెలిపారు

రథం తయారీకి రూ.10 లక్షల విరాళం

ఉరవకొండ: మండలంలోని బూదగవి ఆంజనేయస్వామి దేవస్థానానికి సంబంధించి నూతన రథం తయారీకి అదే గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ వీఎస్ హనుమంతరాయుడు సోమవారం రూ.10లక్షల విరాళాన్ని గ్రామస్తుల సమక్షంలో ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. గ్రామస్తులు మాట్లాడుతూ రథం తయారీకి రూ.70 లక్షల అంచనా వేశామని, ఇందుకు విరాళాల సేకరణ చేపట్టామన్నారు. విరాళాల సేకరణ అనంతరం ఇంకా డబ్బు తక్కువ పడితే మిగితా మొత్తం తానే చెల్లిస్తానని దాత తెలిపారు. అనంతరం దాతను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీరుపన్నగౌడ్, నాగేష్‌గౌడ్, చిరంజీవి, ఆగులురప్ప, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



నగదు అందిస్తున్న హనుమంతరాయుడు

కూడేరుకు త్వరలో రెగ్యులర్ తహసీల్దార్

కూడేరు: మండలానికి రెగ్యులర్ తహసీల్దార్‌ను త్వరలో నియమించనున్నట్లు ఆర్డీఓ మధుసూదన్ సోమవారం 'సాక్షి'కి తెలిపారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ (డిప్యూటీ తహసీల్దార్) మధుసూదన్ ఈ నెల 15 వరకూ మెడికల్ లీవ్‌పై వెళ్లారన్నారు. ఈ విషయంతోపాటు అక్కడ ఖాళీ ఉన్న వీర్వోలు, ఆర్ఐ, టైపిస్టు పోస్టుల విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఖాళీ పోస్టుల భర్తీకి కలెక్టర్ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంపై ప్రత్యేక దృష్టి పెట్టామని సంతకాలు, భూసమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపడతామని ఆర్డీఓ తెలిపారు.

బస్సు సౌకర్యం ఏర్పాటు చేయండి

విడపనకల్లు: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకుడు చెంద్రాయుడు, విద్యార్థులు తల్లిదండ్రులు సోమవారం స్పందనలో అధికారులను కోరారు. మండలంలోని హంచనహాల్, గడేకల్లు, ఎన్.తిమ్మాపురం, కడదరబెంచి, డొనేకల్లు గ్రామాల నుంచి దాదాపు 127 మంది పదో తరగతి పరీక్షలు రాస్తున్నారని, వీరందరికీ అధికారులు ఒకటే ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు పరీక్షకు రావడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల స్పందించి పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండే విధంగా అదనంగా మరో ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేయాలని వారు డిమాండు చేశారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

విడపనకల్లు: మండల పరిధిలోని హావలిగి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పాల్తూరు ఎస్ఐ రామచంద్రయ్య తెలిపిన వివరాల మేరకు..హావళిగి గ్రామానికి చెందిన బళ్లారి పాపిరెడ్డి (53)కి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు బసవరాజు వేరే కాపురం పెట్టడంతో మనస్థాపంతో ఆదివారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. బంధువులు వెంటనే అతడిని కర్ణాటకలోని బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఆయన మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

మరుగుదొడ్లు ఏర్పాటు చేయండి

శెట్టూరు: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో మహిళల కోసం మరుగుదొడ్లు నిర్మించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమంలో తహసీల్దార్ ఫణికుమార్‌కు వినతి పత్రం అందించారు.

ఘనంగా రాతిదూలం లాగుడు పోటీలు

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని గొడిశెలపల్లిలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఆఖరి రోజు నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీలు ఆకట్టుకున్నాయి. పోటీల్లో ఆరు జతల ఎద్దులు పాల్గొన్నాయి. గంగవరం గురుయాదవ్ వృషభాలు రూ.15 వేలు మొదటి బహుమతి కైవసం చేసుకున్నాయి. రెండో బహుమతిని ఆత్మకూరుకు చెందిన కుర్లపల్లి అక్కమ్మ వృషభాలు రూ.10 వేలు, మూడో బహుమతి శీర్పికి చెందిన గోపాల్ వృషభాలు రూ.5 వేలు సొంతం చేసుకున్నాయి. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, సచివాలయాల కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి, సర్పంచ్ రామలక్ష్మి సొంత ఖర్చులతో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మార్తల్ తిప్పేస్వామి, బండి రామకృష్ణ, వైస్ సర్పంచ్ బోయ నారాయణ, రామాంజనేయులు, వన్నూర్‌స్వామి, రామిరెడ్డి, భీమరెడ్డి, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

వైభవంగా సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

కూడేరు: కూడేరులోని శివపార్వతుల స్వయంభు జోడు లింగాల సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం ఉదయం జోడు లింగాలకు ఆలయ అర్చకులు విశేషంగా పూజలు చేపట్టారు. రాత్రి 8 గంటలకు వైశ్య సంఘం ఆధ్వర్యంలో నెమలి వాహనంపై శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఉంచి ఆంజనేయ స్వామి ఆలయం నుంచి పీర్ల మసీదు వరకు విద్యుత్ దీపాలు,పుష్పాలుతో విశేషంగా అలంకరణ చేసిన రథంలో ఉంచి ఊరేగింపు చేశారు. దేవాదలయ శాఖ సిబ్బంది, వైశ్య కులస్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శివపార్వతులను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

రాయదుర్గంటౌన్/రూరల్: పురపాలకసంఘంలోని సచివాలయాల పరిధిలో వివిధ వార్డుల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు సోమవారం మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 10 పోస్టులకు 22 మంది దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూలకు 16 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో మేనేజర్ కిషోర్‌బాబు హాజరయ్యారు. అలాగే రాయదుర్గం మండలంలోని 74 ఉడేగోళం, చదం గొల్లల దొడ్డి గ్రామంలో ఒక్కొక్కటి చొప్పున ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న ఇద్దరు అభ్యర్థులకు ఎంపీడీఓ కొండయ్య సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రఘురామారావు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

కూడేరు: ట్రాన్స్‌కో ఏఈ గౌస్ ఆధ్వర్యంలో సోమవారం కూడేరులోని ట్రాన్స్ కో కార్యాలయం ఎదుట, అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారి పక్కన చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

సజావుగా 'పది' పరీక్షలు ప్రారంభం

రాయదుర్గంటౌన్: పట్టణంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం సజావుగా ప్రారంభమయ్యాయి. జెడ్పీ బాలికోన్నత పాఠశాల, బీజీ తిలక్ మున్సిపల్ హైస్కూల్, రాధాకృష్ణ మున్సిపల్ హైస్కల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, సెయింట్ పాల్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూళ్లలో పరీక్షలు నిర్వహించారు. మొదటి రోజు 1,395 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 50 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ నాగమణి తెలిపారు. విద్యార్థులు మొదటి రోజు తెలుగు, ఉర్దూ పరీక్షలు రాశారు. పరీక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు పరిశీలించాయి.

కణేకల్లు: జెడ్పీబాలుర హైస్కూల్, మోడల్ స్కూల్, విద్యానికేతన్, అతావుల్లా స్కూళ్లలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. మొత్తం 893 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 17 మంది గైర్హాజరయ్యాయని ఎంఈఓ వెంకటేశ్‌బాబు తెలిపారు.

బొమ్మనహాళ్: మండలంలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో 833 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 18 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ తిమ్మప్ప తెలిపారు. ఫ్యాన్ సదుపాయం లేక ఎండవేడిమి, ఉక్కపోతకు విద్యార్థులు ఇబ్బంది పడ్డారు.

గుమ్మఘట్ట: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, ఎంజేబీ, కేజీబీవీ పాఠశాలలో జరిగిన పరీక్షల్లో 576 మందికి గాను ఆరుగురు గైర్హాజరైనట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ నాగమణి తెలిపారు. అబ్జర్వర్ గురుప్రసాద్ పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఉరవకొండ: ఉరవకొండ పట్టణంలో ఐదు కేంద్రాల్లో పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొత్తం 1,380 మంది విద్యార్థులు పరీక్షలకు హజరు కావాల్సి ఉండగా 16 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప పర్యవేక్షించారు.

విడపనకల్లు: మండలంలోని ఆదర్శ పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాల, మాళాపురంలోని కేజీబీవీలో పరీక్ష సెంటర్లు ఏర్పాటు చేశారు.మొదటి రోజు తెలుగు పరీక్షకు 622 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 11 మంది గైర్హాజరైయ్యారని విద్యాశాఖాధికారులు తెలిపారు.

కూడేరు: మండల కేంద్రంలోని హైస్కూల్‌లో పది పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అధికారుల నిర్లక్ష్య వైఖరితో రెండు గదుల్లో విద్యుత్ సౌకర్యం లేక చీకట్లో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. అధికారుల తీరుపై పిల్లల తల్లిదండ్రులు మండిపడుతూ పరీక్ష కేంద్రం నిర్వహణాధికారులతో వాగ్వివాదానికి దిగారు. సమస్యను ఎంఈఓ చంద్రశేఖర్‌కు ఫోన్‌లో వివరించారు. వెంటనే లైట్లు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. కాగా మండలంలోని కేజీబీవీ, హైస్కూల్‌లో మొత్తం 370 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా తొమ్మిది మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ తెలిపారు.

శెట్టూరు: మండలంలో 370మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా ఐదుగురు గైర్హాజరయ్యారు. పరీక్షలను స్క్వాడ్ తారా చంద్రనాయక్ , తహసీల్దార్ ఫణికుమార్, ఇన్‌చార్జిఎంపీడీఓ గంగావతి ఎంఈఓ శ్రీధర్ పరిశీలించారు.

కంబదూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,క స్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి రోజు 336 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.ఫ్లయింగ్ స్క్వాడ్ రవినాయక్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. 324 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా ఒకరు గైర్హాజరయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్ తారా చంద్రానాయక్ , తహసీల్దార్ బాలకిషన్ , ఎంపీడీఓ వెంకట్ నాయుడు, ఎంఈఓ ఓబుళపతి పరీక్షల తీరును పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా డాక్టర్ రాజేష్ కుమార్, సిబ్బంది హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేశారు.



రాయదుర్గంటౌన్: జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



ఉరవకొండ: ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షలకు హాజరైన విద్యార్థులు